క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ మండల స్థాయి సమావేశం

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు సింగరాయకొండ, జరుగుమల్లి మండల పార్టీ అధ్యక్షులు మసనం వెంకట్రావు, పిన్నిక శ్రీనివాసులు వేర్వేరు ప్రకటనలో తెలిపారు. సింగరాయకొండ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు, జరుగుమల్లి మండల కేంద్రంలో సాయంత్రం 5 గంటలకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రకటనల్లో విజ్ఞప్తి చేశారు.

45 మందికి వైద్య పరీక్షలు


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

హనుమంతునిపాడు: ఇంటింటికి వైద్య పరీక్షల్లో భాగంగా శుక్రవారం మిట్టపాలెంలో 45 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన 104 వైద్య క్యాంపులో గర్భిణులు, బాలింతలకు రక్తపరీలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. క్యాంప్‌లో ఏఎన్ఎంలు, ఆశాలు, 104 వైద్య సిబ్బంది మస్తాన్ ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

రేపు శాకంబరిదేవి అలంకరణలో వల్లూరమ్మ

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరు గ్రామంలో వేంచేసియున్న వల్లూరమ్మ దేవస్థానంలో ఆషాడ మాసం సందర్భంగా వల్లూరమ్మ ఆదివారం శాంఖాంబరిదేవి అలంకరణలో దర్శనం ఇవ్వనున్నారని ఆలయ ఈఓ రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈవో మాట్లాడుతూ ఆషాఢ మాసం పంటలు పండే సమయం. ఈ సమయంలో శాకంబరి దేవిని పూజించడం వలన రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉంటారని నమ్మకం. శాకంబరి దేవి అలంకరణలో అమ్మవారిని దర్శించుకుంటే కష్టాలు తొలగిపోతాయని, కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకమని, కావున భక్తులు అందరూ అమ్మవారిని దర్శించుకొని కృపకు పాత్రులు కావాలని తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వినతి


ఎంఈవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

సింగరాయకొండ: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడు పి శ్రీనివాసరావు ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. మండలానికి బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు త్వరగా జీతాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, ఎన్నికల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు సెలవులను ఎస్ఆర్ నమోదు చేయాలని వినతిపత్రంలో కోరారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా పథకాలు అందించాలి

గుడ్లూరు: ప్రభుత్వ పథకాలు పార్టీలకు అతీతంగా అర్హులకు అందించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ పులి రమేశ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వైద్య, ఆరోగ్య, శిశు సంక్షేమ శాఖల్లో ఎన్ని ఖాళీలు ఉన్నాయో తెలపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి ఎంపీడీవో వై వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వాడుకలోకి టంగుటూరు బస్టాప్


బస్టాప్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఆర్ఎం

టంగుటూరు: టంగుటూరు బస్ స్టేషన్‌ను వాడుకలోకి తీసుకురావడమే ప్రధాన లక్ష్యమని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ జి. సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన టంగుటూరు బస్టాప్‌ను సందర్శించారు. కొన్నాళ్లుగా బస్టాప్ అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికుల రాకపోకలు స్తంభించాయి. ఈ క్రమంలో రాకపోకలు మరింత ముమ్మరం చేసేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 21 నుంచి ఒంగోలు, కందుకూరు, కావలి, కొండపి మార్గాల్లో ప్రయాణించే పల్లె వెలుగు, ఇతర ఎక్స్‌ప్రెస్ బస్సులు నిలుపుదల చేస్తారన్నారు. ఆయన వెంట సూపరింటెండెంట్ బి. పణికుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మోసమే బ్రాండ్.. అబద్ధమే జీవితం !

- ఆటోవాలాలకు రూ.15 వేలు ఇస్తామని చంద్రబాబు హామీ
- అధికారం చేపట్టి ఏడాది దాటిన ఊసే లేని వైనం
- ధరలు పెరుగుదల, కిరాయిలు లేక ఆటోవాలాల ఇబ్బందులు


ఆటో స్టాండ్‌లో బాడుగులు లేక నిలిచి ఉన్న ఆటోలు

కొండపి:

అధికారం కోసం బూటకపు హామీలు ఇవ్వడం.. ఎన్నికలకు ముందు ఒక మాట, తరువాత మరొక మాట చెప్పడం అధికారం చేతికిందుకున్న తర్వాత హామీలను అటక ఎక్కించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబును మించిన వారు లేరని ప్రజలు చర్చించుకుంటున్నారు. చంద్రబాబు చెప్పిన మాయమాటలకు అన్ని వర్గాల ప్రజలు మాదిరిగానే తాము కూడా మోసపోయామని పలువురు ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఆటో, టాక్సీ లైసెన్స్ కలిగిన లారీ, టిప్పర్ డ్రైవర్లకు ప్రతి సంవత్సరం రూ.15 వేల ఆర్థిక సహాయం అందిస్తామని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా కల్పిస్తామని కూటమి ఉమ్మడి మేనిఫెస్టోలో పేర్కొంది. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు వీటిపై విస్తృతంగా ప్రచారం చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటిన ఈ హామీలు అమలుకు నోచుకోలేదు. ఇచ్చిన మాట ప్రకారం కనీసం ఆర్థిక సాయమైన అందించాలని ఆటో డ్రైవర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. నియోజకవర్గంలో దాదాపు 1000 ఆటోలు ఉన్నాయి. బస్సులో లేనప్పుడు ప్రయాణికులు ఆటోలపై ఆధారపడి గమ్యస్థానాలను చేరుకుంటారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్సులు లేని గ్రామీణ ప్రాంతాలకు ఆటోలే ఆధారం.

తగ్గిన ఆదాయం.. పెరిగిన ఖర్చులు.

ఆటో నిర్వహణకు సాధారణంగా ఖర్చులుంటాయి. ప్రస్తుతం పెరుగుతున్న డీజిల్ పెట్రోల్ ధరలతో ఆటో కార్మికులకు రోజంతా కష్టపడితే కనీసం రూ.200 నుంచి రూ.300 వరకు కూడా మిగలని పరిస్థితి. ప్రతి సంవత్సరం ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల కోసం దాదాపు రూ.15 వేల వరకు ఖర్చు అవుతుంది. దీంతోపాటు తనిఖీల పేరుతో పోలీసులు రవాణా శాఖ అధికారులు దాడులు చేసి వేల రూపాయలు జరిమానాలు విధిస్తున్నారు. ఆటో కొనుగోలు కోసం తీసుకున్న రుణాలకు నెలవారి వాయిదాలు కట్టుకోలేక ఆటో కార్మికులు బతుకులు, దినదిన గండంగా మారిపోయాయి. వచ్చే అరకొర డబ్బులు ఇంధనం ఇతర ఖర్చులకు సరిపోతున్నాయని వాపోతున్నారు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో భరోసా...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ఏటా బడ్జెట్ కేటాయించేది. అర్హులైన ఆటో ట్యాక్సీ డ్రైవర్లకు ఏడాదికి రూ 10 వేలు వారి ఖాతాల్లో జమ చేసింది. దీంతోపాటు వాహన డ్రైవర్ ప్రమాదవశాత్తు మృతి చెందితే వారి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల బీమా అందించేవారు. అలాగే రవాణా వాహనం కొనుగోలుకు బ్యాంకు నుంచి రుణాలు తీసుకునే డ్రైవర్లకు రూ మూడు లక్షల వరకు వడ్డీ రాయితీ అందించి భరోసా కల్పించారు. టంగుటూరులోని టోల్ ప్లాజా వద్ద రవాణా శాఖ, పోలీసు అధికారులు భారీ జరిమానాలతో మా నడ్డీ విరుస్తున్నారని ఆటోవాలాలు వాపోతున్నారు. అధికారులు ఫైన్లు వేస్తే రోజంతా సంపాదించిన డబ్బు ఫైన్ రూపంలో పోతోందని, ఇంటికి వట్టి చేతులతో వెళ్లాల్సి వస్తుందని ఆటో డ్రైవర్లు వాపోతున్నారు.

రూ .15 వేలు వెంటనే ఇవ్వాలి..



రోజంతా కష్టపడి ఆటో నడిపిన కుటుంబ పోషణ కష్టంగా మారింది. నిత్యావసర సరుకులతో పాటు ఇంధన ధరలు పెరిగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఆటోల ఫైనాన్స్, పెరిగిన బీమా ప్రీమియం, రోడ్డు టాక్స్‌లు కట్టుకోలేక సతమతమవుతున్నాం. ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం ఆటో కార్మికులకు సాయం అందించాలి.

– బీ యాకోబు, కొండపి

కుటుంబ పోషణ భారంగా ఉంది..



పదేళ్లుగా ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నా. ప్రస్తుతం డీజిల్ పెట్రోల్ ధరలు ఆకాశాన్ని అంటుతున్న తరుణంలో కుటుంబ పోషణ భారంగా మారింది. దీనికి తోడు గతంలో మాదిరి ప్రస్తుతం ఆటోలకు అంత గిరాకీ ఉండటం లేదు. ఇలాంటి పరిస్థితి నుంచి ఆటో డ్రైవర్లకు ఆర్థిక సహాయం చేయాలి మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలి.

– ఈ.వినోద్ కుమార్, జయవరం

ఎమ్మెల్యే భానుప్రకాష్‌పై చర్యలు తీసుకోవాలి


దద్దాల నారాయణ యాదవ్

కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ మహిళా నేత, మాజీ మంత్రి ఆర్కే రోజాపై అనుచిత వాఖ్యలు చేసిన నగరి ఎమ్మెల్యే భాను ప్రకాష్ ను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చెప్పలేని రీతిలో మహిళలను కించపరిచే మాటలు మాట్లాడాన్ని తీవ్రంగా ఖండించారు. మహిళా లోకం, సభ్య సమాజం తలదించుకునేలా మాజీ మంత్రి ఆర్కే గూర్చి నీచంగా మాట్లాడాన్ని తీవ్రంగా తప్పు పట్టారు. మాజీ మంత్రి రోజాను రాజకీయంగా ఎదుర్కోనలేకనే నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని.. అతని సిగ్గు లేని తనానికి ఇది నిదర్శనమన్నారు. మాజీ మహిళా మంత్రిని అవమాన పరిచిన, కించపరిచిన ఎమ్మెల్యేపై కఠిన చర్యలు తీసుకోవాలని దద్దాల నారాయణ యాదవ్ డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది


వీరభద్రాపురంలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

సీఎస్‌పురం(పామూరు): ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని ఎంఈఓ జే ప్రసాదరావు, సింగిల్ విండో చైర్మన్ కత్తులపల్లి వెంకటరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఉప్పలపాడు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం పాఠశాల హెచ్‌ఎం షేక్.నాయబ్‌రసూల్ అధ్యక్షతన ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి పాఠశాల అభివృద్ధికి దోహదపడ్డారన్నారు. ఈసందర్భంగా బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు జె.ఎస్.ఆనంద్ బాబు, డి.పున్నమ్మ, కమ్మనేతి వెంకటేశ్వర్లు, ఎల్. ఆంథోని, ఖాజారహంతుల్లా, ఎం.రామయ్యలను వారు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ మౌలాలిరెడ్డి, పులి రాజశేఖర్, ఆచారి, వై.శ్రీనివాసులు, వహీద్, జ్యోష్ణ, ఒంగోలు వెంకటేశ్వర్లు, తోట శ్రీనివాసులు, డి.సుబ్బరాయుడు, జి.రామకృష్ణ, షేక్.మహ్మద్, సీహెచ్.చంద్రశేఖర్, పి.అరుణ, బత్తుల రవీంద్ర, ఎం.గాంధీ, యన్.వి. నారాయణ, జి.శ్రీహరి, పలువురు పాల్గొన్నారు.


బదిలపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ, నాయకులు

పామూరు: మండలంలోని వీరబద్రాపురం జడ్పీహెచ్ఎస్ హెచ్‌యంగా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన గాదె కోటిరెడ్డితోపాటు పలు పాఠశాలలకు బదిలీఅయిన ఉపాధ్యాయులకు శుక్రవారం హెచ్‌యం బూర్ల సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ కోటిరెడ్డి, సర్పంచ్ పువ్వాడి జయమ్మలు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా హెచ్‌యం గాదె కోటిరెడ్డితోపాటు ఉపాధ్యాయులు ఎ.వి.సుబ్బరాజు, ఎస్‌కే.బాషా, మధుసూదన్, బి.భాస్కరరావు, పీడీ వై.శివనాగరాజులను వారు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పువ్వాడి వెంకటేశ్వర్లు, పువ్వాడి రామారావు, అడుసుమల్లి ప్రభాకర్, గుంటుపల్లి శ్రీనివాసులు పలువురు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం


నామమాత్రంగా హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

సింగరాయకొండ: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ కట్టా శోభారాణి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు నామమాత్రంగా హాజరయ్యారు. మండల స్థాయి అధికారులు నామమాత్రంగా హాజరై కేవలం తమ శాఖ ద్వారా జరుగుతున్న పనులను వివరించారు. ఉపాధి హామీ పనులు, అక్రమ లేఅవుట్లు, తాగునీరు సరఫరా, రోడ్ల దుస్థితిపై ఎటువంటి చర్చ జరగలేదు. పంచాయతీ కార్యదర్శులు అయితే స్వర్ణ పంచాయతీ యాప్‌లో ఇంటి వివరాలను అప్‌లోడ్ చేయడం శనివారం ఆఖరి తేది కావడంతో ఆ పనిలో బిజీగా ఉండటంతో సమావేశానికి దుమ్మా కొట్టామని తెలియజేస్తున్నారు. మొత్తం మీద మండల సమావేశం తూతూ మంత్రంగా ముగిసింది. ఎంపీడీవో జయమణి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంస్కరణలతో విద్యావ్యవస్థ అస్తవ్యస్తం


మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అబ్దుల్ హై

పామూరు: ప్రభుత్వం సంస్కరణలపేరుతో ఎనిమిది రకాల పాఠశాలలు ఏర్పాటు చేయడంతో విద్యావ్యవస్థ అయోమయంలో పడి అస్తవ్యస్తంగా మారిందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అబ్దుల్ హై అన్నారు. స్థానిక దాచూరి రామిరెడ్డి భవన్ (యూటీఎఫ్)లో శుక్రవారం పామూరు, సీఎస్‌పురం మండలాల యూటీఎఫ్ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభంలో ఉపాధ్యాయులపై వివిధ కార్యక్రమాల అమలుకు సంబందించి ఒత్తిడి తేవడాన్ని ఆయన ఖండించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పామూరు సురేష్, డి.ఉదయ్‌కుమార్, సీఎస్‌పురం షేక్.పాదుషా, బి.మాధవ పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలకు సమయపాలన తప్పనిసరి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ మహ్మద్ హుస్సేన్

సీఎస్‌పురం(పామూరు): రేషన్ డీలర్లు రేషన్ దుకాణాల నిర్వహణలో విధిగా సమయపాలన పాటించాలని తహసీల్దార్ మహ్మద్ హుస్సేన్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని రేషన్‌డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతినెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్దేశిత సమయాల్లో దుకాణం తీసిఉంచి లబ్ధిదారులకు రేషన్ ఇవ్వాలన్నారు. రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడినా, తూకాల్లో తేడాలు ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో టీడీ భూపతి, సీనియర్ అసిస్టెంట్ పద్మనాభం, చావా చంద్రశేఖర్, మండలంలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన


అర్ధ నగ్న ప్రదర్శనలో పారిశుధ్య కార్మికులు

కనిగిరిరూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పారిశుధ్య కార్మికులు శుక్రవారం మూడో రోజు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు పీసీ కేశవరావు మాట్లాడుతూ ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారంలో తీవ్రంగా వైఫల్యం చెందిందన్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు సమ్మె కాలపు వేతనాలను చెల్లించాలని, మున్సిపాలిటిలో జనాభకు తగ్గట్టు కార్మికులను నియమించాలని, సంక్రాంతి కానుకలు, పనిముట్లు, దుస్తులు, చనిపోయిన కుటుంబాలకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్, సీఐటీయూ నాయకులు చంద్ర, ఓబయ్య, ఓబులు, చార్లస్, లక్ష్మయ్య, ప్రసాద్, సుబ్బయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నారాయణస్వామి ఆరాధన మహోత్సవం


గ్రామోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఈఓ, చైర్మన్

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆరాదన మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈసందర్భంగా అర్చకులు మంకాల శివప్రసాద్‌లు ఆలయంలో స్వామివారి మూలవిగ్రహమూర్తికి, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమహావిష్ణుమూర్తివారి ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించి విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమహావిష్ణుమూర్తివారి ఉత్సవ మూర్తులకు, నారాయణస్వామి ఉత్సవమూర్తికి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ బాణాసంచా కాల్చుతూ గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, ఆలయ మాజీ చైర్మన్ పాములపాటి మాధవప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి రోజాపై అనుచిత వ్యాఖ్యలు హేయం


వైఎం సరితా ప్రసాద్‌రెడ్డి

కనిగిరిరూరల్: మాజీ మంత్రి ఆర్కే రోజా పై నగరి ఎమ్మెల్యే భాను ప్రకాష్ చేసిన అనుచిత వాఖ్యలను ఏఎంసీ మాజీ చైర్మన్ వైఎం సరితా ప్రసాద్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. మహిళలంటే అంత చిన్న చూపుగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. మొన్న గుడివాడలో కృష్ణా జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పల హారికా కారును టీడీపీ గుండాలు చుట్టు ముట్టి కారుపై దాడి చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. హోం మంత్రి అనిత మహిళల మీద జరుగుతున్న దాడులపై, అత్యాచారాలపై దృష్టి సారించకుండా, శ్రద్ధ చూపకుండా బాధాకరమన్నారు. నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ తక్షణం మాజీ మంత్రి ఆర్కే రోజాకు క్షమాపణ చెప్పాలన్నారు.

పాఠశాలకు కుర్చీల బహూకరణ


పాఠశాలకు కుర్చీలు బహూకరించిన దాత

సింగరాయకొండ: మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు శుక్రవారం జరుగుమల్లి మండలం నందనవనం గ్రామానికి చెందిన బిల్డర పందిళ్ల కొండలరావు సుమారు రూ.13 వేల విలువ గల కుర్చీలు అందజేశారు. హెచ్ఎం సీహెచ్ పద్మజ మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయుల సంఖ్య పెరిగినప్పటికి అవసరమైన కుర్చీల కొరత ఉందన్నారు. ఈ సందర్భంగా కొండలరావును ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతల సహకారం ఎంతో అవసరమన్నారు. ఈసందర్భంగా దాత కొండలరావు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి సాయం చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాద్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటరావు మృతి పార్టీకి తీరని లోటు


వెంకటరావు భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న సురేష్, వెంకయ్య

టంగుటూరు: వైఎస్సార్ సీపీ నాయకుడు వెంకటరావు మృతి పార్టీకి తీరని లోటని రాష్ట్ర మాజీ మంత్రి, రాష్ట్ర పీఏసీ సభ్యుడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని అనంతవరం పంచాయతీ పరిధిలోని తాళ్లపాలెం గ్రామ నాయకుడు కన్నా వెంకట్రావు మృతి విషయం తెలుసుకున్న సురేష్ శుక్రవారం వెంకట్రావు భౌతిక కాయానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ప్రమర్శించి, ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, సర్పంచ్ ఉప్పలపాటి శివరామరాజు, రామకృష్ణ, ఉప్పలపాటి నాగరాజు, కొమ్ము సురేంద్ర, శరీమందిర్ వెంకటేశ్వర్లు, శ్రీను, తదితర నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి


పారిశుద్ధ్యంపై గ్రామస్తులతో మాట్లాడుతున్న చిరంజీవి

పొన్నలూరు: గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జెడ్పీ సీఈవో చిరంజీవి అన్నారు. ఐవీఆర్ఎస్, ఇంటి నుంచి చెత్త సేకరణ కార్యక్రమంలో భాగంగా పొన్నలూరు, శింగరబొట్లపాలెం గ్రామాల్లో శుక్రవారం పర్యటించి పారిశుద్ధ్యం, చెత్త సంపద తయారీ కేంద్రాలను పరిశీలించి ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రమైన గ్రామాల కోసం క్షేత్రస్థాయి అధికారులు కృషి చేయాలన్నారు. పారిశుద్ధ్య కార్మికుల ద్వారా సేకరించిన చెత్తను చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలించి తడి, పొడి చెత్తను వేరు చేసి తడి చెత్తతో వర్మీ కంపోస్ట్ తయారు చేయాలన్నారు. అలాగే చెత్త సంపద తయారీ కేంద్రాల దగ్గర మొక్కలను విరివిగా నాటాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డాక్టర్ సుజాత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్సై

పొన్నలూరు: మాదకద్రవ్యాలైన గంజాయి, కొకైన్ వంటి వాటికి యువతీ, యువకులతో పాటు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్సై అనూక్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో శుక్రవారం విద్యార్థులకు మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలు, బెట్టింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉన్నప్పుడే ఉజ్వల భవిష్యత్ ఏర్పడుతుందన్నారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలను సేవించినా, విక్రయించినా, రవాణ చేసినా అట్టివారిపై తీవ్ర చర్యలు తీసుకుంటామన్నారు. అత్యాశలకు పోయి సైబర్ నేరాలు, బెట్టింగులకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి సన్మార్గంలో నడిచి కళాశాల దశ నుంచే బాగా చదువి ఉన్నత లక్ష్యాలను చేరుకొని తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తెవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేంద్రబాబు, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై అనూక్

గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన

హనుమంతునిపాడు: విద్యార్థినులు చదవు మీద దృష్టి సారించాలని ఎస్సై ఎం మాధవరావు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రం హనుమంతునిపాడు జెడ్పీహెచ్ఎస్‌లో గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థినులు సోషల్ మీడియాలో జాగ్రత్తగా ఉండాలన్నారు. వ్యక్తిగత సమాచారం, ఫోటోలు అప్‌లోడ్ చేయొద్దని ఆయన సూచించారు. చుట్టుపక్కల ఎవరైన అసభ్యంగా ప్రవర్తించినా, మాట్లాడినా వెంటనే పోలీసుల దృష్టికి తీసకురావాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ అంజమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.